బహుమతి అందుకుంటున్న హిమజ

వ్యాస రచన పోటీల్లో విద్యార్థిని హిమజ ప్రతిభ

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 8 : మండలంలోని నమిలిగొండ కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న కే హిమజ వ్యాస రచన పోటీల్లో ద్వితీయ బహుమతి పొందింది. దీనికి సంబంధించిన వివరాలను కేజీబీవీ ఎస్‌వో రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ వన్య ప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 5న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో వరంగల్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు. హిమజ ద్వితీయ స్థానం స్థాధించి అవార్డు పొందినట్లు రజిత తెలిపారు. హిమజను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

పాలకుర్తి, అక్టోబర్ 8: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించబోయే ఇంటర్నేషనల్ స్కూళ్లలో ప్రమోషన్ ద్వారా సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులను తీసుకోవాలని పీఆర్టీయూ కోరింది. ఈ మేరకు మంగళవారం సంఘం మండల అధ్యక్షుడు వడ్లకొండ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి బైకాని వెంకన్న విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 35వ స్టేట్ కౌన్సిల్ సమావేశంలో పలు తీర్మానాలు చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గంలోకి మండలం నుంచి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కూటికంటి సోమయ్య, తీగల శ్రీనివాస్‌రావు, తిరునగరి నిర్మల, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మారేపల్లి కవిత, రొండ్ల రణదీర్‌రెడ్డి, బీరం వెంకటరెడ్డి, ఆకుల సరిత, కొట్టే రామానుజన్, రాష్ట్ర కార్యదర్శిగా వడిచెర్ల సుధాకర్‌ను తీసుకున్నారని వారు తెలిపారు.

తెలుగు భాషకు ఆద్యుడు సోమనాథుడు

సోమనాథుడి స్మృతివనం వద్ద పుష్పగిరి

పాలకుర్తి,అక్టోబర్ 8: సాహిత్యంలో తెలుగు భాష గురించి తొలుత ప్రస్తావించి గుర్తింపు తెచ్చిన మహాకవి పాల్కురికి సోమనాథుడు అని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు, కవి, విశ్వనాథుల పుష్పగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాల్కురికి సోమనాథుడి స్మృతివనాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమనాథుడికి ముందు ఆంధ్రము అనగా సోమన మాత్రమేనని పేర్కొన్నారు. తెలుగు, జాను తెనుగు అనే పదాలను తన కావ్యాల్లో సోమనాథుడు రాశారని ఆయన వివరించారు. తెలుగు భాష అస్తిత్వానికి ఆద్యుడైన పాల్కురికి సోమనాథుడి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని ఆయన కోరారు. ఆయన వెంట సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, గూడూరు లెనిన్ ఉన్నారు.

కాంస్య పతక విజేతకుకలెక్టర్ అభినందన

హనుమకొండ : ఇటీవల ప్యారిస్‌లో జరిగిన పారా లింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా అథ్లెట్ దీప్తీ జీవన్‌జీని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. మంగళవారం కలెక్టర్‌ను పారా లింపిక్ పతక విజేత దీప్తీ జీవన్‌జీ, ఆమె తల్లి ధనలక్ష్మి, కోచ్ నాగపురి రమేశ్ కలిశారు. దీప్తి జీవన్‌జీ, నాగపురి రమేశ్‌ను కలెక్టర్ సత్కరించారు. మరిన్ని అంతర్జాతీయ పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, అక్టోబర్ 8 : వానకాలం సీజన్ 2024-25కు సంబంధించి పకడ్బందీగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో సన్న రకం ధాన్యం సుమారు 55 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశారు. సన్న రకం ధాన్యం కొనుగోలు కోసం 116 కొనుగోలు కేంద్రాలు, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు 180 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొదటిసారి సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్‌గా ఇస్తుందని తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటలలోపు నగదు జమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం సేకరణకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రికార్డులు నిర్వహించాలని కోరారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, డయల్ గ్రెయిన్ క్యాలిబర్‌లు, చెక్ పోస్టులు, టోకెన్లు, వేయింగ్ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సన్న, దొడ్డు రకానికి వేర్వేరుగా రిజిస్టర్లు నిర్వహించాలని, ఇందులో రైతుల పేరు, ఫోన్ నంబర్, సమయం, స్థలం ఉంచాలని, రైతు సంతకం తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతం 17గా ఉండాలని సూచించారు. వర్షాలపై రైతులను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో వసంత, డీసీఎస్‌వో సరస్వతి, డీఏవో రామారావు నాయక్, డీఎం సీఎస్ హాతీరాం పాల్గొన్నారు.

విజేతలకు పతకాలను అందజేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

డ్యూటీ మీట్ పోటీలతో వృత్తిలో నైపుణ్యం

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, అక్టోబర్ 8 : డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం వల్ల పోలీస్ అధికారులు తమ వృత్తిలో మరింత రాణిస్తారని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఇటీవల వరంగల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో విజయం సాధించిన పోలీస్ అధికారులకు మంగళవారం పతకాలను బహూకరించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ కమిషనరేట్, ఖమ్మం, కమిషనరేట్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ఈ నెల 3నుంచి మూడు రోజుల పాటు వరంగల్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో నిర్వహించారు. అధికారులు రోజువారీగా నిర్వర్తించే విధులకు సంబంధించి 18 విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన ముగ్గురికి సీపీ పతకాలను అందజేశారు. ఈ పోటీల్లో రాణించిన అధికారులు హైదరాబాద్‌లో ఈ నెలలో జరిగే తొలి రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా నేరస్తులను గుర్తించడం సులభం కావడంతో పాటు నిందితులకు శిక్షలు పడుతాయని, బాధితులకు న్యాయం చేసిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, అక్టోబర్ 8 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల కారణంగా గోపాల్‌పుర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరస్వతీ నగర్, మహాత్మానగర్, విజయ్‌నగర్ కాలనీ, మాధవనగర్ కాలనీ ఏరియాలు, అలాగే మధ్యాహ్నం 12 నుంచి 2గంటగల వరకు ద్వారక సాయి కాలనీ, నవయుగ కాలనీ, జవహర్ కాలనీలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వర్గీకరణ లేకుండా టీచర్ పోస్టులు భర్తీ చేయొద్దు

ఎంఈఎస్ జాతీయ నాయకుడు కుమ్మరి రాజన్న మాదిగ

కాజీపేట, అక్టోబర్ 8 : ఎస్సీ వర్గీకరణ చేయకుండా టీచర్ పోస్టులను భర్తీ చేయడం మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి నమ్మ ద్రోహం చేయడమేనని ఎంఈఎస్ జాతీయ నాయకుడు కుమ్మరి రాజన్న మాదిగ అన్నారు. సోమిడిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి తిప్పారపు మల్లేశ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి 1,162 టీచర్ పోస్టులను ఎస్సీ వర్గీకరణ చేయకుండా భర్తీ చేస్తామనడం బాధాకరమన్నారు. ఈ నెల 9న నగరంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి స్వరాజ్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు కుమ్మరి శ్రీనివాస్, కాజీపేట కార్యదర్శి ఇనిగాల రాజు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న రెండు టిప్పర్ల పట్టివేత

దామెర, అక్టోబర్ 8 : మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్సై కొంక అశోక్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సింగరాజుపల్లి నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా రెండు టిప్పర్లలో మొరం తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అనుమతి లేకుండా మొరం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయంలో స్వామివారిని దర్శించుకుటున్న భక్తులు

108 బంగారు పద్మాలతో వెంకన్నకు పూజలు

చిల్పూరు, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అష్టాదశ పాద పద్మారాధన పూజలు చేశారు. తిరుపతిలో నిర్వహించినట్లుగా 108 బంగారు పుష్పాలతో స్వామివారిని కొలిచారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎస్ మోహన్‌బాబు మాట్లాడుతూ అష్టాదశ పాద పద్మారాధన పూజలను ప్రతి మంగళవారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు, మాజీ దేవస్థాన డైరెక్టర్ సంగోజు మోహన్‌చారి-శంకరలక్ష్మి దంపతులు, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

కొడకండ్ల, అక్టోబర్ 8 : మండలంలోని మొండ్రాయికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దౌపాటి కొమురమల్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు పాకాలకు చెందిన సంకినేని సోమన్న, మహేశ్వరి దంపతుల గృహనిర్మాణానికి ఎర్రబెల్లి హాజరయ్యారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు పనస రాజు-లావణ్య దంపతుల కుమారుడి జన్మదిన వేడుకలకు హాజరై బాలుడిని ఆశీర్వదించారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

రేషన్‌బియ్యంను చూపుతున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు, అక్టోబర్ 8 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నపెండ్యాల నుంచి అక్రమంగా ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల నమిలిగొండకు చెందిన మేకల సారయ్య చిన్నపెండ్యాల మీదుగా తరలిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ట్రాలీని సీజ్ చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, కానిస్టేబుల్ వీరన్న పాల్గొన్నారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధాని లోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద



ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపర